చిరువ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



తమ సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వివరిస్తున్న పండ్ల వ్యాపారులు

చైతన్యపురి: ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. చైతన్యపురి, కొత్తపేట ప్రాంతాల్లో పండ్లు అమ్ముకునే పలువురు చిరు వ్యాపారులు తమను ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బుధవారం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుల వల్లే ట్రాపిక్ పోలీసులు చిరు వ్యాపారుల వద్దకు వస్తున్నారని అన్నారు. ఫుట్‌పాత్‌లు కేంద్రంగా వ్యాపారాలు చేసుకునే వారు కాలనీల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా: తీగల



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురంలోని ప్రసన్నాంజనేయ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీగల మాట్లాడుతూ, రామకృష్ణాపురంలోని ఆంజనేయ ఆలయం చాలా మహిమ గల క్షేత్రమని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సరూర్‌నగర్, శ్రీరామకృష్ణాపురం డివిజన్లలోని కాలనీల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి శ్రీప్రసన్నాంజనేయ ఆలయం, ఖిల్లా మైసమ్మ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చామల శైలజారెడ్డి, పగ్గిళ్ల భూపాల్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, పగడాల ఎల్లన్న, బేరా బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్) అందరినీ ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. మేళా కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పక పాటించాలి

వడ్డేపల్లి రాంచందర్



వడ్డేపల్లి రాంచందర్‌ను సన్మానిస్తున్న జీఎస్‌ఐ ఏడీజీ వెంకటేశ్వర్‌రావు తదితరులు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ)లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పక పాటించాలని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. జీఎస్‌ఐలోని మల్టీపర్పస్ హాల్‌లో మంగళవారం రాత్రి జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రిజర్వేషన్స్ ఫర్ షెడ్యూల్డ్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ జనరల్ లెక్చర్ ఫర్ ఎస్సీ, ఎస్టీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాం చందర్ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను తప్పకుండా పాటించాలని, రిజర్వేషన్ల ప్రాతిపదికపై పదోన్నతులు కల్పించాలన్నారు. జీఎస్‌ఐలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని కోరారు. రిజర్వేషన్లలో పొరపాట్లు జరిగితే నేరుగా తనను సంప్రదించాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అనంతరం ఆయనను జీఎస్‌ఐ ఎడీజీ హెచ్‌ఓడీ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ శాలువాలతో ఘనంగా సత్కరించారు. డీడీజీలు ఎల్‌పీ సింగ్, మహాపాత్ర, డైరెక్టర్ నేషనల్ కమిషన్ ఫర్ ఎస్సీ సునీల్‌కుమార్‌బాబు, రీసెర్చ్ ఆఫీసర్ వరప్రసాద్, డైరెక్టర్లు ఎంఎల్ దొర, అనూప్ ఎన్ కంబ్లె, తారకేశ్వర్‌రావు, అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి



నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: ప్రపంచ నీటి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా శాంతి కోసం నీరు అనే అంశంతో నాగోలు డివిజన్ జైపురి కాలనీలో టౌన్ లెవెల్ మహిళా సంఘం సభ్యులకు సీడ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యత, నీటిని ఎలా పొదుపుగా వాడుకోవాలి అనే అంశాలను హయత్‌నగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం వివరించారు. వర్షం నీటిని భూగర్భ జలాలుగా మార్చుకునేందుకు ప్రతి ఇంటిలో వాల్టా యాక్ట్ నిబంధనల ప్రకారం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భావి తరాలకు నీటి కష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అర్చన, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగబ్రహ్మాచారి, రాజు, మమత, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- జోన్ పరిధిలో మూడు చెక్ పోస్టుల ఏర్పాటు
- 24 గంటలూ నిఘా
- ప్రస్తుతం అందుబాటులో రెండు సాయుధ పోలీసు బలగాలు
- త్వరలో మరికొన్ని రాక
- ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్

ఎల్‌బీనగర్ పరిధిలో 376 లొకేషన్లు, 982 పోలింగ్ బూత్‌లు





నాగోలు: ఎలాంటి అక్రమాలు, అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించకోవాలని ఆయన కోరారు.

సాక్షి: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎలాంటి చర్యలు, ప్రణాళికలు చేస్తున్నారు?

డీసీపీ: ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మాజీ రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ఎన్నికలకు ఆటకం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశాం. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో లైసెన్స్‌డ్ ఆయుధాలు ఉన్నవారి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నాం. జోన్ పరిధిలో 3 సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటలు తనిఖీలు చేస్తున్నాం. ప్రతి వ్యక్తి తన వెంట కేవలం 50 వేలు మాత్రమే తీసుకెళ్లడానికి వీలు ఉంటుంది.అంతకంటే ఎక్కువ నగదు ఉన్నట్టు తెలితే వెంటనే సీజ్ చేస్తాం. ఈ మొత్తాన్ని ఎన్నికల తర్వాత ఆధారాలు చూపించి తీసుకెళ్లాలి.

సాక్షి: ఎన్నికల్లో ఎంత మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు?

డీసీపీ: ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ఎల్‌బీనగర్ జోన్‌లో రెండు కేంద్ర సాయుధ బలగాలతో పాటు స్థానిక పోలీసులు అందుబాటులో ఉన్నారు. మరికొన్ని రోజుల్లో ఇంకొన్ని కేంద్ర బలగాలు అందుబాటులోకి వస్తాయి. ఆర్మీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, స్ట్రైకింగ్ స్పెషల్ టీంలు తిరుగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటర్లు ధైర్యంగా ఓటు వేసేందుకు భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.?

డీసీపీ: ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది నిఘా ఉంది. ఎన్నికల నిబంధనలు పాటించకుండా రాత్రి సమయంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం, ఓటర్లకు నగదు, ఇతర బహుమతులు అందజేయడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం వంటివి చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

సాక్షి: ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.?

డీసీపీ: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో 376 లొకేషన్లు, 982 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: ఓటర్లకు మీరు ఇచ్చే సందేశం ఏంటి?

డీసీపీ: ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించకోవచ్చు.ఓటు వేసే వారు భయపడాల్సిన అవసరం లేదు. నిత్యం మీకోసం, శాంతి భద్రతల కోసం రాచకొండ పోలీసులు పని చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వారు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఎన్నికల సెల్ ఏర్పాటు చేశాం. ఎక్కడైన ఇబ్బందులు ఏర్పడితే డయల్ 100, 8712662100 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

బండిని కలిసిన బీజేవైఎం నేతలు



బండి సంజయ్‌ను సత్కరించిన భరత్‌కుమార్

మలక్‌పేట: బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అనుముల భరత్‌కుమార్ మంగళవారం రాత్రి బీజేపీ నేత బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేవైఎం నాయకులతో కలిసి ఆయనను శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఈ సందర్భంగా సంజయ్ అన్నారని భరత్‌కుమార్ తెలిపారు. యువ మోర్చాను బలోపేతం చేయాలని, పార్టీలో యువతకు సముచిత స్థానం ఉంటుందని చెప్పారన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



శ్రీనివాస్‌గుప్తాకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీవ్యాసా శ్రమ గురుపరంపర స్వామి

నాగోలు: డివిజన్ పరిధిలోని ఎస్‌పీఆర్ కన్వెన్షన్ లో జరుగుతున్న 98వ శ్రీసనాతన వేదాంత జ్ఞాన సభల్లో భాగంగా బుధవారం హోమం, పూర్ణాహుతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వ్యాసాశ్రమ గురుపరంపర స్వామి సమక్షంలో నిర్వహించిన ఈ పూజల్లో ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులను, పూజారులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు స్వాములు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు

మలక్‌పేట: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కృష్ణ తులసినగర్‌లోని తన నివాసంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ కార్యకర్త ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మూసారంబాగ్‌కు చెందిన భరత్‌కుమార్ బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆయన్ను సన్మానించారు. నాయకులు వై.సురేందర్, కొప్పుల దినేష్, సంతోష్, దినేష్, మనోజ్, విశాల్, మల్లేష్, రోహన్ పాల్గొన్నారు.

కాలనీల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. అనంతరం రోషన్‌దౌలా బస్తీలో స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుజాతా నాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివిజన్‌లోని కాలనీల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా మూలకే..!

- లక్షల రూపాయలు వెచ్చించి ట్రీగార్డుల కొనుగోలు
- వినియోగించకుండా పక్కన పడేసిన వైనం



రాక్ పార్కులో వృథాగా పడి ఉన్న ట్రీగార్డులు

బడంగ్‌పేట్: కరువు రక్కసిని పారదోలి వర్షాలు సమృద్ధిగా కురవాలంటే అందుకు తగ్గ అడవులు, చెట్లను పెంచాలనే ఆలోచనలతో తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణాన్ని సమతుల్యం చేసే దిశగా అడుగులు వేశారు. కానీ, బడంగ్‌పేట కార్పొరేషన్‌లో వింత పరిస్థితి నెలకొంది.. హరితహారం లక్ష్యాన్ని పక్కన పెట్టి నర్సరీల్లో పెంచే మొక్కలను నాటకుండా వృథా చేస్తున్నారు. మొక్కల రక్షణకోసం తెచ్చిన ట్రీగార్డులను ఒక చోట దాచి ఉంచారు. బడంగ్‌పేట కార్పొరేషన్ ఏర్పడక ముందు నగర పంచాయతీ, ఆ తర్వాత మున్సిపాలిటీగా ఉన్న సమయంలో కొత్తగా పెట్టిన హరితహారం పథకానికి ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు మహా క్రేజ్ చూపించేవారు. మొక్కలు పట్టుకుని ఇంటింటికీ తిరిగి కాలనీల్లో మీటింగ్‌లు పెట్టి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేసేవారు. బాధ్యతగా మొక్కలు తీసుకుని కుటుంబ సభ్యుడివలే ఆ మొక్కలను పెంచి పెద్దచేసే వారు. ఆ తర్వాత మున్సిపల్ కాస్త కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కొత్తలో రెండేళ్లుగా హరితహారంపై ప్రత్యేక దృష్టి పెట్టి వార్డులు, డివిజన్లల్లో మొక్కలు పెంచేలా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. గడిచిన మూడేళ్ల నుంచి హరితహారంపై అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. హరితహారం మొక్కలకు రక్షణ ఉండేందుకు కాలనీవాసులు, సంక్షేమ సంఘాల ఫిర్యాదుల మేరకు అధికారులు ట్రీ గార్డులు తెప్పించారు. టన్నుల కొద్దీ ట్రీగార్డులను తెచ్చి నర్సరీలో భద్రపరిచారు. ఆ ట్రీగార్డులు మూడేళ్లుగా వానకు నాని, ఎండకు ఎండి చీకిపోతున్నాయి. హరితహారంతో పాటు పట్టణ ప్రగతిలో మొక్కలు పంపిణీ చేయాలని ఉన్నా అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ట్రీగార్డులను వాడుకోకుండా వదలివేయడం సరికాదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. లక్షలు వెచ్చించి వాటిని కొనడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు కట్టిన పన్నులను ఈ రూపంలో వృథా చేయడం సరికాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వర్షాలు పడుతున్నప్పుడు మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టడంలో విఫలమయ్యారు. ప్రస్తుత ఎండాకాలంలో మొక్కల పంపిణీ జరగదు.. తెచ్చిన ట్రీగార్డులను ఏం చేస్తారో అధికారులకే తెలియాలి.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీ చేరికలు



సీఎంతో కాంగ్రెస్‌లో చేరిన సామ రమణారెడ్డి తదితరులు

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చడంతోనే తనతో పాటు డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్తలు యాభై మంది కాంగ్రెస్ పార్టీలో చేరామని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, ఆ పార్టీ సీనియర్ నాయకుడు సామ రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రమణారెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరిన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, పట్నం మహేందర్ రెడ్డి తనకు రాజకీయ గురువని, ఆయన సతీమణి సునీతా మహేందర్‌రెడ్డి మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నారని ఆమెను భారీ మెజారిటీతో గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో బెక్కం లక్ష్మీనారాయణ, బిట్టు చిరంజీవి, ఖాదర్, జమీల్, గంగబాబు, నాగరాజు, కృష్ణయాదవ్, బండారు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ ఇన్‌చార్జి



ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎస్‌వీ కృష్ణప్రసాద్ తదితరులు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎస్‌వీ కృష్ణప్రసాద్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో కృష్ణప్రసాద్‌తో పాటు ఎల్‌బీనగర్ మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ మల్లారం షాలిని, గడ్డిఅన్నారం డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎం సునీల్‌బాబు, తెలుగు యువత అధికార ప్రతినిధి మురళీధర్‌రెడ్డి, వనస్థలిపురం టీడీపీ అధ్యక్షుడు వెలగ చంద్రశేఖర్, చంపాపేట ఉపాధ్యక్షుడు ఆరె.కృష్ణ తదితర నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మెచ్చి కాంగ్రెస్‌లో చేరానని కృష్ణ ప్రసాద్ తెలిపారు.

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తాం..



సీఎంను కలిసిన వెంకట్‌గౌడ్

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు పందుల వెంకట్‌గౌడ్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పరారీలో యజమాని..వలస కూలీలపై కేసు

చంచల్‌గూడ: మలక్‌పేట సివిల్ సప్‌లై పరిధిలో అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుమలు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో యాకుత్‌పురా వాహెద్ కాలనీలో ఇమ్రాన్ అనే వ్యక్తి అక్రమంగా పీడీఎస్ బియ్యం, గోధుమలు నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు మలక్‌పేట సివిల్ సప్‌లైశాఖ డిప్యూటీ తహసీల్దార్ ఎన్.కవితకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మంగళవారం సాయంత్రం బృందంతో కలిసి గోదాంలో దాడి నిర్వహించగా 3 టన్నుల బియ్యం, 150 కిలోల గోధుమలు లభించాయి. గోదాంలో కూలీ పనిచేస్తున్న బీహార్‌కు చెందిన అరవింద్‌కుమార్, మున్నార్, మనోజ్‌కుమార్‌తో పాటు గోదాం యజమాని ఇమ్రాన్‌పై చర్యలు తీసుకోవాలని మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వలస కూలీలతో పాటు పట్టుకున్న సరుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. కాగా యజమాని ఇమ్రాన్ పరారీలో ఉన్నాడు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న పాలక మండలి సభ్యులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. భక్తులు స్వామి వారికి కానుకల రూపంలో 65 రోజులకు గాను రూ.20 లక్షల 60 వేల 652 నగదు, 410 డాలర్లు, 10 యూకే పౌండ్లు సమర్పించారని ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. లెక్కింపును దేవాదాయశాఖ సహాయక కమిషనర్ మాణిక్ ప్రభు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు ఆనంద్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస యాదవ్, మధుసాగర్, తిరుమలేష్, అంజిరెడ్డి, యాదగిరి, కిరణ్‌గుప్తా, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కళాశాలల్లో అక్రమ అడ్మిషన్లు అడ్డుకోవాలి: ఏఐవైఎఫ్

సైదాబాద్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నగరంలోని పలు ప్రైవేట్ కళాశాలలు అక్రమంగా అడ్మిషన్లకు పాల్పడుతున్నారని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ ఆరోపించారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు కళాశాలల అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలని కోరారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో లక్షల రూపాయాల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అంతే కాకుండా పలు యాజమాన్యాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కళాశాలలు నడిపిస్తున్నాయని, అలాంటి వాటిలో చదివే విద్యార్థుల భవిష్యత్ గందరగోళంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న కళాశాలలు, అనుమతులు లేకుండా నడుపుతున్న కళాశాలలపై హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారికి, ఆయా కళాశాలల మండల పరిధిలోని విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 23. దొండ 28, ఆలు 25, ఉల్లి 22, గోకర 35, దోస 18, సొర 9, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 55, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 70. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

29న 'రేపేంది' నాటిక ప్రదర్శన

వనస్థలిపురం: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 29న సాయంత్రం 6 గంటలకు ఎన్జీఓస్ కాలనీలోని లైబ్రరీ గ్రౌండ్‌లోని శ్రీ చంద్ర కళావేదికపై 'రేపేంది' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, సూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఎస్.రామచందర్ రావు, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కె.లక్ష్మయ్య తదితరులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

సంతోష్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సంతోష్‌నగర్‌లోని బన్నాక నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాగ్ మార్చ్ అస్మాల్ ఎక్స్ రోడ్డు, కుమ్మర్‌వాడీ, యూనిక్ స్కూల్, మోయిన్‌బాగ్, జమాల్ కాలనీ, రక్షాపురం, అరుంధతి కాలనీ, గుల్షన్ ఎక్బాల్ కాలనీ తదితర ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, సంతోష్‌నగర్ పోలీసులతో కలిసి నిర్వహించారు. సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ..ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.రఘువీర్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ స్టాన్లీ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. బుధవారం మండలంలోని మొహబ్బత్‌నగర్ సమీపంలో భగవతి పురంలో మెగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలు అందించడమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. నిత్యం కొంత సమయాన్ని యోగా, ధ్యానం, వాకింగ్, వ్యాయమానికి కేటాయిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 | 9912220363
9505507616 | 9912220365